## క్లుప్తంగా

### 'అండలూరి'కి సత్కారం



సత్యనారాయణను సత్కరిస్తున్న స్వర్ణకార సంఘం నాయకులు

**మండపేట:** రాష్ట్ర స్వర్ణకార సంఘం నుంచి నిస్వార్థ సేవా పురస్కారం అందుకున్న పట్టణానికి చెందిన సూక్ష్మ కళాకారుడు అండలూరి వీర వెంకట సత్యనారాయణను స్థానిక స్వర్ణకార సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని విజయవాడలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన వేడుకల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి చేతుల మీదుగా సత్యనారాయణ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం మండపేటలో స్వర్ణకార సంఘం అధ్యక్షుడు నరిగిరి కృష్ణ, సంఘ నాయకులు లంగోజు కృష్ణమోహన్, వెదురుపర్తి శ్రీనివాస్, వెల్ల నాగేశ్వరరావు, త్రిపురారి సోమశేఖర్, బాణాల షరాబు తదితరులు సత్కరించారు.

### కొత్త పింఛన్ల పంపిణీ



పింఛన్లు అందజేస్తున్న పార్టీ మండల కన్వీనర్ గుబ్బల ఏసురాజు, సర్పంచ్ ప్రసన్నమౌనిక తదితరులు

**కాజులూరు:** గొల్లపాలెంలో కొత్తగా మంజూరైన పింఛన్లను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గుబ్బల ఏసురాజు, సర్పంచ్ ప్రసన్నమౌనిక తదితరులు బుధవారం 37 మంది లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎంసీ వైస్ చైర్మన్ కాకతీయ రాజు, పంచాయతీ పాలకవర్గ సభ్యుడు పెంటపాటి శ్రీను, జెడ్పీ హైస్కూల్ పేరెన్స్ కమిటీ చైర్మన్ మాత నాగరాజు, పార్టీ నాయకులు మాత బోస్, చంద్రరావు, వెంటపల్లి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు నోటిఫికేషన్

**కాజులూరు:** మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకులు పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైనట్టు తాళ్లరేవు ఐసీడీఎస్ సీడీపీఓ బి.మాదవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గొల్లపాలెం-5(సాయిబాబా కాలనీ)లో సహాయకురాలు పోస్టు ఓసీ (జనరల్), పెనుమళ్ల ఎస్సీపేట సహాయకురాలు పోస్టు ఎస్టీకి కేటాయించారన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 21 నుంచి 35ఏళ్ల మధ్య వయస్సు కలిగి స్థానిక మహిళలు ఈ పోస్టులకు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ కేటగిరిలకు కేటాయించిన చోట 18 సంవత్సరాలు నిండిన అభ్యర్థుల దరఖాస్తులు పరిశీలించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తాళ్లరేవు ఐసీడీఎస్ కార్యాలయం దరఖాస్తులు ఈ నెల 29వ తేదీ సాయంత్రం లోపు అందజేయాలన్నారు. అన్ని సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలపైనా గజిటెడ్ అధికారి సంతకం ఉండాలన్నారు.

### వై.సీతానగరం సర్పంచ్ మృతి



వరదా లక్ష్మి

**మండపేట:** ఏడిద సీతానగరం సర్పంచ్ వరదా లక్ష్మి(85) బుధవారం తెల్లవారుజామున మృతిచెందారు. ఆమెకు ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా ప్రస్తుత ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ నేత చక్రవర్తి రెండో కుమారుడు. ఆమె భర్త గణపతి ఉమ్మడి ఏడిద పంచాయతీలో సభ్యుడిగా, ఉప సర్పంచ్‌గా సేవలందించారు. ఏడిద నుంచి సీతానగరం పంచాయతీ ఏర్పాటులో కీలకపాత్ర వహించారు. సర్పంచ్ లక్ష్మి మృతి సమాచారం తెలిసి ఎంపీడీఓ ఐ.రాజు ఉదయాన్నే ఆమె నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కుడుపూడి భవాని, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు, ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, ఎంపీటీసీ సభ్యురాలు అద్దాల శ్రీదేవీ, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ కన్వీనర్ టీవీ గోవిందరావు తదితరులు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు

### గ్రామాల్లో ఆధార్ అప్‌డేట్ సేవలు

**కపిలేశ్వరపురం:** మండలంలోని వాకతిప్ప, వడ్లమూరు గ్రామాల్లో బుధవారం ప్రత్యేక ఆధార్ శిబిరాలను నిర్వహించారు. సమీప గ్రామాల ప్రజలు తమ ఆధార్‌లను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. వేలి ముద్రలు, ఐరిష్, ఫొటో, చిరునామా తదితర అంశాలను నవీకరించుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో లబ్ధి పొందేందుకు ఆధార్ కార్డులోని వివరాలను సరైనవి అయ్యి ఉండాలని ఆధార్ సెంటర్లలో తమ వివరాలను సరిచేసుకోవాలని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి తెలిపారు.

### కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ రిలే దీక్ష

**మండపేట:** పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేత దూలి జయరాజు ఆధ్వర్యంలో మండపేటలో చేపట్టిన రిలేదీక్షలు 8వ రోజుకు చేరాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో బుధవారం పట్టణానికి చెందిన పైడిమళ్ల సతీష్, జొన్నాడ పాపమ్మ, పలివెల అచ్చిరాజు, ఎం.హరీష్ దీక్ష చేశారు.

# ఆదాయార్జనకు బాటలు

- ద్వారపూడి పంచాయతీకి స్థిరాస్తి
- శరవేగంగా షాపింగ్ కాంప్లెక్స్ పనులు
- అద్దెల రూపంలో నెలకు రూ.70 వేలు వరకూ రాబడి
- ప్రయాణికుల కోసం బస్‌షెల్టర్



ద్వారపూడిలోని పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్

**మండపేట:** ద్వారపూడి పంచాయతీ ఆర్థికాభివృద్ధికి బాటలు వేసింది. ఆదాయార్జనకు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తోంది. ఇప్పుడు ఆ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ కాంప్లెక్స్ ద్వారా అద్దెల రూపంలో పంచాయతీకి నెలకు రూ.70 వేలు వరకు ఆదాయం సమకూరనుంది. కాంప్లెక్స్ చెంతనే ప్రయాణికుల కోసం విశాలమైన బస్ షెల్టర్ కూడా నిర్మించింది.

**ఇదీ సంగతీ..**

వస్త్ర మార్కెట్‌కు ద్వారపూడి రాష్ట్ర వ్యాప్తంగా పేరొందింది. గ్రామంలోని క్లాత్ మార్కెట్‌కు వెళ్లే రోడ్డులోని షాపులకు మంచి గిరాకీ ఉంటుంది. ఈ రోడ్డులోని ప్రధాన కూడలి వద్ద రైల్వే ఫ్లైఓవర్‌ను ఆనుకుని పంచాయతీ స్థలం ఉంది. ఈ వంతెన నిర్మాణ సమయంలో ఇక్కడ ఉండే తొమ్మిది షాపులను అధికారులు తొలగించారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న స్థలాన్ని వినియోగంలోకి తెచ్చి పంచాయతీకి ఆదాయం తీసుకువచ్చేందుకు పాలకవర్గం కృషి చేసింది. గ్రామ సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు తదితరులు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకురాగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఆయన చర్యలు చేపట్టారు. ఇందుకు అధికారులూ అనుమతిచ్చారు.

**వ్యాపారుల భాగస్వామ్యంతో..**

వ్యాపారుల భాగస్వామ్యంతో ఈ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. గతంలో షాపులు కోల్పోయిన తొమ్మిది మంది వ్యాపారులకు ఇక్కడ షాపులు కేటాయిస్తూ మొత్తం 39 షాపులతో కాంప్లెక్స్ నిర్మాణానికి పంచాయతీ తీర్మానించింది. నిర్మాణ పనుల కోసం ఒక్కో వ్యాపారి పంచాయతీకి రూ.ఆరు లక్షలు చెల్లించాలి. ఈ మొత్తంలో రూ.1.5 లక్షలు పంచాయతీకి డిపాజిట్ కాగా ఈ సొమ్ముపై వ్యాపారులకు ఏ విధమైన హక్కు ఉండదు. మిగిలిన రూ.4.5 లక్షలు నిర్మాణ పనులకు వినియోగించేలా నిర్ణయించారు. గతంలో షాపులు కోల్పోయిన తొమ్మిది మందికి డిపాజిట్ సొమ్ము నుంచి మినహాయింపునిచ్చారు. నిబంధనలకు అనుగుణంగా వ్యాపారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారు. వ్యాపారుల నుంచి డిపాజిట్లు రూపంలో పంచాయతీకి రూ.45.5 లక్షలు ఆదాయం సమకూరగా, సుమారు రూ.1.75 కోట్ల వ్యయంతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి. వచ్చే



విశాలమైన బస్ షెల్టర్

నెలలో ప్రారంభించేందుకు పంచాయతీ చర్యలు తీసుకుంటోంది. స్థిరాస్తితో పాటు అద్దెల రూపంలో నెలకు రూ.70 వేలు వరకూ పంచాయతీకి ఆదాయం సమకూరుతుందని అంచనా.

**సౌకర్యవంతంగా బస్టాండు**

షాపింగ్ కాంప్లెక్స్‌ను ఆనుకుని ప్రయాణికుల కోసం సౌకర్యవంతంగా విశాలమైన బస్ షెల్టర్ నిర్మాణం చేశారు. షెల్టర్ వద్ద టాయిలెట్స్ సదుపాయం కల్పించారు. గతంలో ఇక్కడ ఉండే షెల్టర్ ఇరుకుగా రోడ్డుపైకి అడ్డంగా ఉండడంతో బస్సులు నిలిపేందుకు స్థలం ఉండేది కాదు. తరచూ ట్రాఫిక్ జామై ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. షాపింగ్ కాంప్లెక్స్‌ను ఆనుకుని నిర్మాణం చేయడంతో రెండు మూడు బస్సులు ఆగేందుకు వీలుంటుందని స్థానికులు అంటున్నారు.

**గ్రామాభివృద్ధే లక్ష్యం**



ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సహకారంతో ద్వారపూడి గ్రామాభివృద్ధి లక్ష్యంగా పాలకవర్గం పనిచేస్తోంది. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎన్నో అభివృద్ధి పనులు చేస్తుండడంతో పాటు పంచాయతీ ఆర్థిక పురిపుష్టికి కృషి చేస్తున్నాం.

– ఈతకోట కిన్నెర, సర్పంచ్, ద్వారపూడి

**పంచాయతీకి ఆదాయం**



షాపింగ్ కాంప్లెక్స్‌తో పంచాయతీకి స్థిరాస్తితో పాటు అద్దెల రూపంలో ఆదాయం వస్తుంది. ప్రయాణికుల కోసం విశాలమైన షెల్టర్ నిర్మించాం. ఎమ్మెల్సీ తోట కృషితో ఇక్కడకు అన్ని ఆర్టీసీ సర్వీసులు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం.

– తులా శేషారావు, ఉప సర్పంచ్, ద్వారపూడి

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

మండల సమావేశంలో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఎంసీ చైర్మన్ సిరిపురపు, ఎంపీపీ శ్రీనివాస్ తదితరులు

**మండపేట:** పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కనీవినీ ఎరుగని రీతిలో అనేక పథకాలను అమలు చేస్తున్నారని, వాటిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లి అర్హులందరికీ లబ్ధి చేకూరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఏఎంసీ చైర్మన్ సిరిపురపు మాట్లాడుతూ ద్వారపూడి రోడ్డు అభివృద్ధిని గురించి గత పాలకులు పట్టించుకోలేదని, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో రోడ్డు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఎంపీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ ద్వారపూడి పీహెచ్‌సీలో సాయంత్రం ఆరు గంటల తర్వాత వైద్య సిబ్బంది ఉండడం లేదని స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, నిర్లక్ష్యంగా పని చేస్తే ఉపేక్షించేది లేదని ఆరోగ్య సిబ్బందిని హెచ్చరించారు. ఎంపీడీఓ ఐ.రాజు మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణ కోసం ఈనెల 30వ తేదీ నుంచి ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. గ్రామాల్లో కుక్కల బెడద అధికంగా ఉందని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఏడిద నుంచి వై.సీతానగరం వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులో ఇరువైపులా తుప్పల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం కోరారు. ఎంపీపీ పసుమర్తి నాగబాబు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులకు సూచించారు. మండలంలో వ్యవసాయ, విద్య, వైద్యం, విద్యుత్, ఇరిగేషన్ తదితర శాఖల ప్రగతిని గురించి ఆయా శాఖల అధికారులు సభ్యులకు వివరించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సమావేశంలో ఏఎంసీ చైర్మన్ సిరిపురపు, ఎంపీపీ శ్రీనివాస్ తదితరులు ఆవిష్కరించారు. తొలుత బుధవారం వై.సీతానగరం సర్పంచ్ వరదా లక్ష్మి మృతిపై తమ సంతాపాన్ని తెలియజేస్తూ సభ్యులు మౌనం పాటించారు. మండల ఆర్బీకే కమిటీ చైర్మన్ అన్నందేవుల చంద్రరావు, తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు, పరిపాలన అధికారి ఎన్వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఊపందుకున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



సర్వే వివరాలను నమోదు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

**కపిలేశ్వరపురం:** రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నాగంగా గ్రామాల్లో ప్రజల ఆరోగ్యంపై సర్వే ఊపందుకుంది. తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలోని అధికారుల బృందం పర్యవేక్షణలో గ్రామాల్లోని వైద్య ఆరోగ్య కార్యకర్తలు, వలంటీర్లు ఇంటింటి సర్వే చేస్తున్నారు. అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీలకు చెందిన ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని నమోదు చేస్తున్నారు.

# ట్రస్టు సేవలు అభినందనీయం



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న విజయభాస్కరరెడ్డి, లక్ష్మణరెడ్డి

**మండపేట:** పోటీ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాణించేందుకు ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు చేస్తున్న కృషి అభినందనీయమని మండల మాజీ ఉపాధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నేత గొలుగూరి విజయభాస్కరరెడ్డి అన్నారు. ట్రస్టు వైస్ చైర్మన్ సత్తి లక్ష్మణరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అర్తమూరులోని శ్రీసత్యభాస్కర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను విజయభాస్కరరెడ్డి అందజేశారు. ఆయన మాట్లాడుతూ వేలాది రూపాయలు వెచ్చించి ఎస్‌బీఎస్ఆర్ ట్రస్టు అందిస్తున్న తోడ్పాటును విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా అనపర్తి, రంగంపేట, పొలమూరు, తాపేశ్వరం తదితర పాఠశాలలకు చెందిన విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించామన్నారు. ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ట్రస్టు 28వ వార్షికోత్సవంలో ఘనంగా సత్కరించి, వారికి పుస్తకాలను అందజేస్తామని లక్ష్మణరెడ్డి తెలిపారు. హెచ్ఎం త్రిమూర్తులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ట్రస్టు కన్వీనర్ కోనాల సత్తిరెడ్డి, తాడి శేషారత్నం, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పేదల వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట

చైర్‌పర్సన్ దుర్గారాణి



హెల్త్‌కార్డులు అందజేస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

**మండపేట:** పేదవర్గాల వారు ఆరోగ్యవంతమైన జీవనం సాగించేలా వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ భవ మేళాను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకురావడం ద్వారా పేదలకు ఉచితంగా దివంగత వైఎస్ కార్పొరేట్ వైద్యాన్ని అందించారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా పేదలకు మరింత మేలు జరుగనుందని చైర్‌పర్సన్ దుర్గారాణి తెలిపారు. అనంతరం హెల్త్‌కార్డులను పంపిణీ చేశారు. ఆస్పత్రి సూపరింటిండెంట్ రాధాకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, షేక్, జంగమ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ అలీఖాన్‌బాబా, మీగడ శ్రీనివాసరావు, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఈ-క్రాప్ ప్రక్రియ తనిఖీ



దంగేరులో ఈ-క్రాప్ వివరాలను తనిఖీ చేస్తున్న బోసుబాబు

**రామచంద్రపురం రూరల్:** మండలంలోని హసన్‌బాద, ఉండూరు గ్రామాల్లో జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు బుధవారం ఈ-క్రాప్ ప్రక్రియను తనిఖీ చేశారు. ఈ క్రాప్ చేసే విధానం, రికార్డులను ఆయన వ్యవసాయాధికారులను అడిగి తెలుసుకుని తగిన సూచనలు చేశారు. రామచంద్రపురం మండలంలో 85 శాతం ఈ-క్రాప్ నమోదు జరిగినట్టు ఆయన తెలిపారు. ఈనెల 25లోపుగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఏడీఏ రంగారావు, ఏఓ ఎస్ సత్యప్రసాద్ గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

**కె.గంగవరం:** మండలంలోని పలు గ్రామాల్లో జిల్లా వ్యవసాయ అధికారి ఎ.బోసుబాబు ఈ-క్రాప్ పంట నమోదు ప్రక్రియను బుధవారం తనిఖీ చేశారు. దంగేరులోని ఉప్పులూరి వీర వెంకట సత్యనారాయణ మూర్తి, గంగవరంలోని పెంటపాటి వీరవెంకటలక్ష్మి, వీర్రాఘవులు, వెంకటేశ్వరరావుల వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. మండల అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బందికి పలు సూచనలు చేశారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు రంగారావు, మండల వ్యవసాయ అధికారి బలుసు రవి, వీవోఏలు వంశీ, శ్రీరామచంద్రమూర్తి మంజు ప్రవల్లిక ఉన్నారు.

# విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు



విద్యార్థులకు బస్‌పాస్‌లు అందజేస్తున్న పట్టాభిరామయ్య చౌదరి

**మండపేట:** పట్టణంలోని ఎస్ఎస్‌వీవీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం ఉచిత బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. ఈ పాస్‌లను వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి చేతుల మీదుగా 175 మంది విద్యార్థులకు అందజేశారు. ఆరు నుంచి పదో తరగతి వరకు బాలికలకు, 12ఏళ్ల లోపు ఆరు, ఏడు తరగతుల బాలురకు ప్రభుత్వం ఉచితంగా బస్‌పాస్‌లు అందిస్తోందని ఇన్‌చార్జి హెచ్ఎం వై.వెంకట్రావు తెలిపారు. కార్డు ప్రింటింగ్, లామినేషన్‌కు అవసరమైన ఆర్థిక సాయాన్ని శ్రీవేగుళ్ల సూర్యారావు చారిటబుల్ ట్రస్టు అందజేసిందన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు ఐ.సూరిబాబు, జీడీవీపీ ప్రసాద్, ఉపాధ్యాయులు కొవ్వూరి గోపాలకృష్ణారెడ్డి, బి.నారాయణరావు, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### 'పది' విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

**కొత్తపేట:** ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులను దత్తత తీసుకుని మెరుగైన ఉత్తీర్ణత సాధించేలా చూడాలని డీఈఓ కె.కమలకుమారి సూచించారు. బుధవారం కొత్తపేటలో పలు పాఠశాలలు, భవిత సెంటర్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల బాలల అభ్యసనా సామర్థ్యాలు పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల నోట్ బుక్స్ చూశారు. 9వ తరగతి విద్యార్థుల ట్యాబ్‌లను పరిశీలించారు. రోజూ ట్యాబ్‌లతో పాఠశాలలకు హాజరు కావాలని, వాటిని సక్రమంగా వినియోగించాలని సూచించారు. అనంతరం గౌతమీనగర్ పాఠశాలను తనిఖీ చేశారు. ఎంఆర్‌సీలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. పాఠశాలల స్థితిగతుల గురించి సమీక్షించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలకు అనుగుణంగా ఫలితాలు సాధనపై దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలన్నారు. అందుకు ప్రత్యేక కృషి చేయాలన్నారు. లైబ్రరీ వినియోగం పెంచాలని, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్, హెచ్ఎం అల్లూరి గోపాలరాజు పాల్గొన్నారు.

### ఈవోపీఆర్డీగా పదోన్నతి

**ఆలమూరు:** మండలంలోని మోదుకూరు, గుమ్మిలేరు పంచాయతీల కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న డి.సుబ్బారావుకు ఈవోపీఆర్డీగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రెండు రోజుల్లో సుబ్బారావుకు పోస్టింగ్ ఇవ్వనున్నారు.

# అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ



చంద్రకళ



మీనాక్షి

**రామచంద్రాపురం:** కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో ప్రథమ స్థానంలో నిలిచారు. జూనియర్ కళాశాల విద్యార్థిని పోలినాటి విజయ భార్గవి చంద్రకళ కాకినాడ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో హైజంప్, లాంగ్ జంప్ రెండు విభాగాల్లోనూ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైందని కళాశాల ప్రిన్సిపాల్ వి.సోమశేఖరరావు, పీడీ జంపన రఘురాంలు బుధవారం స్థానిక విలేకరులకు తెలిపారు. కళాశాల అధ్యాపకులు ఎం.రామారావు, చక్రధర్, వీరన్న, సునీత, ప్రసాద్ వెంకటేష్, సుబ్బారావు వెంకటరెడ్డి తదితరులు ఆమెను అభినందించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని పి.మీనాక్షి కాకినాడ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ మీట్ హైజంప్ విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సి.సత్యలత తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, వ్యాయామ విభాగ అధిపతి సాగర్ ఇతర అధ్యాపకులు మీనాక్షిని అభినందించారు. ఆ విద్యార్థులు గుంటూరులో జరిగే స్టేట్ మీట్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలు ఈ నెల 21వ తేదీ నుంచి గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరుగుతాయని పేర్కొన్నారు.

### సీఐ దాతృత్వం



అనాథ మహిళలకు భోజనం అందజేసిన సీఐ దుర్గారావు

**రామచంద్రపురం:** స్థానిక సీఐ వి.దుర్గారావు దాతృత్వాన్ని చాటుకున్నారు. స్వతహాగా ఎన్నో ధార్మిక, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆయన విశ్వ చైతన్య శక్తి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇద్దరు మహిళలకు జీవిత కాలం పాటు భోజన సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకున్నారు. పట్టణంలోని శివాలయం వద్ద దీన స్థితిలో ఉన్న ఇద్దరు మహిళలను సీఐ గుర్తించారు. వారికి భోజనం పెట్టారు. అనంతరం వారి జీవితకాలమంతా భోజనం కోసం ప్రతి నెలా రూ.3200 ట్రస్ట్‌కు తాను అందిస్తానని విశ్వ చైతన్య శక్తి చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ పడాల విజయ గంగాధర్‌కు తెలియజేశారు. సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించి, మరిన్ని మంచి సేవా కార్యక్రమాలు చేపట్టాలని ట్రస్ట్ సభ్యులకు సీఐ సూచించారు.

### మహిళల హర్షం



జగన్నాథగిరిలో నరేంద్రమోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

**కాజులూరు:** పార్లమెంట్ సమావేశాలలో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదిస్తూ చట్ట సభలలో 33 శాతం రిజర్వేషన్ కల్పించడంపై బుధవారం కాజులూరు మండల గ్రామాలలో పలువురు మహిళలు హర్షం వ్యక్తం చేశారు. జగన్నథగిరిలో బీజేపీ మండల మహిళా మోర్చ అధ్యక్షురాలు అర్జివేణి ఆధ్వర్యంలో స్థానిక ఎంపీటీసీ కొప్పన లక్ష్మి తదితరులు పాల్గొని పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశ పెట్టిన ప్రధాని నరేంద్రమోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నలాది వీరబాబు, మహిళామోర్చ మండల ప్రధాన కార్యదర్శి అమలగంటి ప్రశాంతి, సభ్యులు బత్తుల మాణిక్యాలు, కుమారి, పద్మావతి, అనంతలక్ష్మి, అచ్చుతాంబ తదితరులు పాల్గొన్నారు.

### వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు

**రామచంద్రపురం రూరల్:** గ్రామాల్లో ఖాళీలు ఏర్పడిన వలంటీర్ పోస్టులకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు ఎంపీడీవో సెలట్ రాజు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని బాపనయ్య చెరువు, చోడవరం, ద్రాక్షారామ, జగన్నాయకులపాలెం, మాలపాడు, తోటపేట, వెలంపాలెం, యనమదల గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున, వెల్ల, తాడిపల్లి గ్రామాల్లో రెండు చొప్పున వలంటీర్ పోస్టులు ఖాళీలున్నాయన్నారు. దరఖాస్తుదారులు పదో తరగతి ఉత్తీర్ణత సాధించి 18ఏళ్ల నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగి, గ్రామానికి చెందిన వారై ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

### ముగిసిన జిల్లాస్థాయి విద్యార్థి సైన్స్ సెమినార్



సెమినార్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు

**రామచంద్రపురం రూరల్:** ద్రాక్షారామ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి సైన్స్ సెమినార్ తృణ ధాన్యాలు విశేషమైన ఆహారమా వ్యామోహ పూరితమైన ఆహారమా అనే అంశంపై పాఠశాల విద్యార్థులకు సైన్స్ సెమినార్‌ను బుధవారం నిర్వహించారు. ఈ సెమినార్‌లో సుమారు 65 పాఠశాల నుంచి 65 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లాస్థాయి ప్రథమ స్థానం కె.గంగవరం జెడ్పీ ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానం అనాతవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తృతీయ స్థానం జెడ్పీహెచ్ఎస్ తొండవరం, ప్రోత్సాహక బహుమతిని గౌతమి మున్సిపల్ ఉన్నత పాఠశాల మండపేట కైవసం చేసుకున్నాయని జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎంఈఓలు మానుపూడి శ్రీనివాస్ వాసంశెట్టి నాగేశ్వరి హెచ్ఎం రాజేశ్వరి, డిస్ట్రిక్ అకాడమీ కోఆర్డినేటర్ బ్రహ్మానందం, రిటైర్డు ఎన్‌సీపీ అధికారి మాచిరాజు, త్రినాథ్, జిల్లా రిసోర్స్ పర్సన్లు సుజాత ధనలక్ష్మి, గంటి స్వామి, ప్రసాద్ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

### గణపతి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



అంగరలో సాక్షి గణపతికి పూజ చేస్తున్న భక్తులు

**కపిలేశ్వరపురం:** మండలంలోని నిడసనమెట్ట, అంగర, వడ్లమూరు, అచ్యుతాపురం, కాలేరు, నల్లూరు, టేకి, నాగులచెరువు, మాచర, కోరుమిల్లి, వాకతిప్ప, అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల్లోని వినాయక నవరాత్రి శిబిరాల్లో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. పుణ్య దంపతులు పీటలపై కూర్చుని స్వామికి పూజలు చేశారు. ఆయా గ్రామాల్లోని శిబిరాల్లో పండితులచే ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలను చేపట్టారు.